# మంచిమార్కులు రావాలంటే ---!



ఆ రోజు మధ్యాహ్నానికి స్కూల్ వార్షిక పరీక్షలు ముగిసినయి. ఆదే సాయంత్రం ఓ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. పిల్లలు టీచర్లు అందరు వున్నారు. ప్రధానోపాధ్యాయుడు లేచి -

"తోటి మిత్రులారా, ప్రియమైన విద్యార్థులారా.

మీరు పరీక్షల్లో పాసై పై తరగతులకు వెడతారు. ఏడవ తరగతి వాళ్లు ఉన్నత పాఠశాలలకు వెడతారు. పై తరగతుల్లో పాఠ్యాంశాలు ఇంకా వివరంగా వుంటాయి. కాస్త కఠినంగా కూడ వుంటాయి. మీరు ఇంకా ఎక్కువ శ్రద్ధ చూపించవల్సివుంటుంది. వెనక బడితె వెనకే. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ స్కూల్లలో చదువును కొనడం జరుగుతుంది". అనగానే టీచర్లు చప్పట్లు కొట్టారు. పిల్లలు వాళ్లతోపాటు చేతులు కలిపారు.

"దురదృష్టకరం ఏమిటి అంటే స్కూల్ వాళ్లె పిల్లలకు అక్రమ పద్ధతులను నేర్పుతువున్నారు. మార్కులు ఎక్కువ వచ్చేటట్లు చూస్తువున్నారు. మనం పేపర్లలో చూస్తువున్నాం. తల్లి-తండ్రులు కూడ అప్పుచేసి పిల్లలను ప్రైవేట్‌గానే

చదివిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు బాగా చదవాలి. ఎక్కువ మార్కులు తెచ్చుకొని తెలివితేటలను పెంచుకోవాలి. బాగా చదువుకున్న వాళ్లకు మంచి వుద్యోగాలు వస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలు వుంటాయి.

నిన్నమొన్న మీరు రాసిన ఆన్సర్ పేపర్లను దిద్దినాను. ప్రశ్నలకు మీరు జవాబు యిచ్చిన తీరు సరిగలేదు. విషయవివరణ అంతబాగా లేదు. పాఠాలు చెప్పేటప్పుడు బాగా వినాలి. మనస్సు ఎక్కడో పెడితే పాఠం అర్థంకాదు. నేను మీకు కొన్ని చిట్కాలు చెపుతాను. గుర్తుంచుకుంటారు కదా." అన్నాడు. అది విన్న విద్యార్థులు ఏకాగ్రత చూపులతో టీచర్‌వైపు చెవులుంచారు.

"ప్రతి విద్యార్థి ఇంటి దగ్గర చదువుకోసం కొంత సమయాన్ని ఎంచుకోవాలి. చదివేటప్పుడు బుర్రలో మరోవిషయానికి తావు ఇవ్వకూడదు. చదువ దలుచుకున్న పుస్తకాన్ని తీసుకోవాలి. ఒక వేళ అది ఇంగ్లీషు సబ్జెక్టు అయితే డిక్షనరి దగ్గరుంచుకోవాలి. తెలియని పదం వుంటే అందులోచూసి అర్థం తెలుసుకోవాలి. ఆ అర్థాన్ని సంబంధిత పదం పక్కన రాసి వుంచుకుంటే యింకా మంచిది. ఒకే పాఠాన్ని రెండు మూడు సార్లు చదవాలి. ముఖ్యమైన పేరాలను పెన్సిల్‌తో అండర్‌లైన్ చేసుకోవాలి. ఆ తరువాత చదివేటపుడు మొత్తం పాఠం చదవ అక్కరలేదు. అండర్‌లైన్ చేసిన అంశాలు చదివితే చాలు పాఠం అర్థం అవుతుంది. ఇకమీరు పరీక్షల్లోని ప్రశ్నలకు సులభంగా జవాబు రాయగలరు. రాస్తారు. మంచి మార్కులు వస్తాయి" అన్నాడు.

పిల్లలంతా ఏదో రహస్యాన్ని తెలుసుకున్నట్టు చప్పట్లు కొట్టారు. అల్లావుద్దీన్ అద్భుత దీపం దొరికినట్టు నవ్వు ముఖాలతో ఒకరినొకరు చూసుకున్నారు.

"పిల్లలు ఈ పద్ధతికి మీరు అలవాటు పడితే ముందు ముందు పై తరగతుల్లో కూడ మీరు సరియైన జవాబులు రాయగలరు. మంచి మార్కులు వస్తాయి. దాంతో మీ టీచర్లు మిమ్మల యిష్టపడతారు. తల్లి - తండ్రులు ఎక్కువ ప్రేమతో చూస్తారు. కాలేజీల్లో రాంకులు సాధిస్తారు". పిల్లలు మళ్లీ చప్పట్లు కొట్టారు.

ప్రధానోపాధ్యాయులుగారు మిగతా టీచర్లవైపు చూస్తు "మీలో ఎవరైన మాట్లాడుతారా" అన్నప్పుడు తెలుగు పండితులుగారు లేచి -

"ప్రధానోపాధ్యాయులవారు, తోటి ఉపాధ్యాయులు, ప్రియమైన విద్యార్థులారా, నాకంటె ముందు మన ప్రధానోపాధ్యాయులవారు మీకు చాలా విషయాలను వివరించారు. ఇది కంప్యూటర్ కాలం. లెక్కలు, సైన్స్ మొదటి స్థానంలో వున్నాయి. భవిష్యత్తులో కూడ వాటికే స్థానం కనిపిస్తుంది. అయినా భాషను మరవద్దు. అన్నిటికి భాషే మూలం. ఈ ఇంగ్లీష్ కల్చర్ వల్లా మాతృభాష శబ్దం, రూపం మారిపోతువుంది. ఎందువల్ల అంటే స్కూల్లో ఓ తీరు భాషను చదువుతున్నాం. ఇంట బయట ఓ తీరు భాషను మాట్లాడుతున్నాం. చాల ఇంగ్లీష్ పదాలు తెలుగు వాక్యాలలో చోటు చేసుకుంటున్నాయి. అయినా అసలు మాతృభాషను మరవద్దు. మాతృభాషలోని కొన్ని పదాలు మారిపోతున్నాయి. కాదనను. కావ్యపఠనంద్వార మనం భాషను కొంతైన కాపాడుకోవచ్చు. అందుకోసం పంచకావ్యాలను చదవకపోయినా సులభంగా అర్థం అయ్యేకావ్యాలనైనా చదవాలి. 'వేమన పద్యాలను' కంఠతపడితే, పదాలను పలకడం తెలిసిపోతుంది. మునుముందు 'ముత్యాలసరాలు' లాంటి

పుస్తకాలు చదివితే ఇంకెంతో తెలుస్తుంది. అందువల్లా మీరేమైనా చదవండి, భాషను కాపాడుకోవాలి. శెలవు" అంటు కూర్చున్నాడు.

"ఇంకెవరైనా" అన్నట్టు చూశాడు.

లేదు అన్నట్టు తలలూపారు మిగతా టీచర్లు.

"మీరు మీ మీ ఇండ్లకు వెళ్లొచ్చు. జూన్ '5'న స్కూల్స్ తెరుస్తారు. ఉన్నత పాఠశాలకు '8'వ తరగతికి వెళ్లే వాళ్ల టి.సి.లు కూడ అప్పటివరకు సిద్ధంగా వుంటాయి" అంటు లేచి బయటికి నడిచాడు. మిగతా టీచర్లు, ఆయనను అనుసరించారు.

'మంచి మార్కులు రావాలంటే సార్ చెప్పినట్టు బాగ రెండు, మూడు సార్లు చదవాలన్నమాట', అనుకుంటు వాళ్ళ వెనకాల విద్యార్థులూ నడిచారు.

●